# మ్యానిఫెస్టో లేకుండా ఏ ముఖంతో పోతరు?

- ఎజెండా.. మ్యానిఫెస్టో లేని పార్టీ బీజేపీ
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేశ్‌రెడ్డి మండిపాటు
- బీజేపీకి రాజీనామా



హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి

హనుమకొండ, నవంబర్ 1 : జిల్లాలో బీజేపీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించినప్పటి నుంచి టిక్కెట్ దక్కనివారు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. తాజాగా బీజేపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి ఏనుగుల రాకేశ్‌రెడ్డి బీజేపీకి బుధవారం రాజీనామా చేశారు. వరంగల్ పశ్చిమ నియోజక వర్గం నుంచి టికెట్ ఆశించి పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మకు రావడంతో భంగపడ్డ రాకేశ్‌రెడ్డి, బీజేపీ అధిష్టానంపై మండిపడ్డారు. తన అనుచరులతో కలిసి బుధవారం సాయంత్రం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. టిక్కెట్ రాకపోవడంతో మనస్తాపానికి లోనైన ఆయన తనను పొమ్మన లేక పొగపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి ఎంతో కష్టపడ్డ తనకు టికెట్ ఇవ్వలేదని విచారం వ్యక్తం చేశారు. టికెట్ ఇవ్వకున్నా కనీసం ఇప్పటి వరకు తనతో ఎవరూ మాట్లాడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'పుట్టిన గడ్డకు సేవ చేయాలనే తపనతో ఉన్నత ఉద్యోగాన్ని వదిలి బీజేపీలో చేరిన నేను 11 ఏళ్ల అనుబంధాన్ని తెంచుకుంటున్నందుకు ఎంతో బాధగా ఉంది' అంటూ భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా నిబద్ధతతో వంద శాతం పూర్తి చేశానని చెప్పారు. ఈ పదేళ్ల ఎన్నో కష్టాలు, అవమానాలు భరించి పార్టీ పటిష్టానికి పాటుపడ్డానని చెప్పారు. యువ మోర్చా నాయకుడిగా ఉన్నపుడు ఉమ్మడి జిల్లాలో అనేక మంది కార్యకర్తలను తయారు చేశానన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్న తనను పార్టీ ఎన్నోసార్లు అవమానించిందని, అవహేళన చేసిందని, జిల్లా కార్యాలయంలో అడుగు పెట్టకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనేక మంది బీజేపీ అభ్యర్థులను గెలిపించానని గుర్తుచేశారు. అన్ని అర్హతలు సాధించి నియోజకవర్గంలో ప్రతి ఇంటి గడప తొక్కిన తనకు టికెట్ ఇవ్వాలని కోరినప్పటి నుంచే తనపై పగపెంచుకున్నారన్నారు. 'రాష్ట్ర నాయకునికి నోటీస్ ఇచ్చే అర్హత జిల్లా అధ్యక్షురాలికి ఉంటుందా? అసలు ఇదేం పార్టీ.. ఏ ఒక్క నాయకుడు కూడా అడగలేదు' అని ప్రశ్నించారు. సర్వేల ఆధారంగా టికెట్ ఇస్తామని చెప్పి బీజేపీ జాతీయ నాయకులు తనను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేలన్నీ తనకు అనుకూలంగా వచ్చాయని తెలిపారు. ప్రశ్నించే గొంతును నొక్కేయడంతో పాటు ప్రజాబలం ఉన్న వారిని బీజేపీ తొక్కేస్తోందని ధ్వజమెత్తారు. పార్టీలో యువతకు, ప్రతిభ ఉన్నవారికి సైతం స్థానం లేదని, వారిని ఎదగనివ్వరని మండిపడ్డారు. వేలకోట్ల అధిపతి కొడుకు కాబట్టే సెకండ్ లిస్ట్‌లో జితేందర్‌రెడ్డి కొడుక్కు టికెట్ ఇచ్చారని, తాను ఓ రైతు బిడ్డను కాబట్టే తనకు టికెట్ ఇవ్వలేదన్నారు.

## సిద్ధాంతాలు లేని పార్టీ బీజేపీ

బీజేపీ సిద్ధాంతాలు లేని పార్టీ అని రాకేశ్‌రెడ్డి విమర్శించారు. బీజేపీకి అసలు ఒక ఎజెండా.. మ్యానిఫెస్టో అంటూ ఉందా అని ప్రశ్నించారు. మ్యానిఫెస్టోనే లేకుండా ఏముఖంతో ఎన్నికల ప్రచారానికి పోతారని నిలదీశారు. అసోసియేషన్ ఆఫ్ బిలియన్ మైండ్స్ తనకే టికెట్ ఇవ్వాలని సూచించినా ఇవ్వలేదన్నారు. ఒక్క తేజస్వి సూర్యకు టికెట్ ఇచ్చి యువతకు ప్రాధాన్యత ఇచ్చామని బీజేపీ అధిష్టానం అంటోందని, బీజేపీకి పట్టిన శని గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అని, ఆయన కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేదని ఆరోపించారు. ప్రజాబలం లేని ఆయన జిల్లా రాజకీయాలను శాసిస్తున్నాడని విమర్శించారు. వర్గాలను ఏర్పాటు చేసి పార్టీని నాశనం చేస్తున్నాడని దుయ్యబట్టారు. సిద్ధాంతం అంటూ యువత భవిష్యత్తును బీజేపీ నాశనం చేస్తోందన్నారు. బీజేపీయే ప్రత్యామ్నాయం అని ప్రజలు నమ్మినా కొందరి వ్యవహారంతో అట్టడుగుకు పడిపోయిందన్నారు. ప్రజలు గుర్తించిన తనను, బీజేపీ మాత్రం గుర్తించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రావు పద్మకు పోటీ రాకేశ్‌రెడ్డితోనా లేక ఇతర పార్టీలతోనా అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా కనీసం ఏడు సీట్లలో కూడా బీజేపీ గెలవదన్నారు. తన అనుచరులతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని పేర్కొన్నారు. సమావేశంలో లావుడ్య రవినాయక్, దేవయ్య, రాకేశ్‌రెడ్డి అనుచరులు పాల్గొన్నారు.

# పాలకుర్తి కాంగ్రెస్‌లో సీనియర్ల నారాజ్..!

- ఝాన్సీరెడ్డి ఒంటెత్తు పోకడే కారణం
- మూకుమ్మడి రాజీనామాలకు యోచన
- దేవరుప్పల సమావేశంలో నియోజకవర్గ నేతల నిర్ణయం

దేవరుప్పుల, నవంబర్ 1 : పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి ఝాన్సీరెడ్డి తీరుతో ఆ పార్టీ నేతల్లో ఒకింత ఆగ్రహం, ఆవేదన కట్టలు తెచ్చుకుంటున్నది. 40ఏళ్ల నుంచి పార్టీనే నమ్ముకొని, పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్న సీనియర్లు, ఆమె ఒంటెత్తు పోకడ కారణంగా మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధపడే పరిస్థితి వచ్చింది. ముందొచ్చిన చెవులకన్నా.. వెనకొచ్చిన కొమ్ములే వాడి అన్న చందాన వ్యవహారం ఉందని మదన పడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం దేవరుప్పులలోని ఓ ఫంక్షన్ హాల్లో వీరంతా సమావేశమై ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తున్నది. మూడు నెలలుగా తానే అభ్యర్థినంటూ ప్రచారం చేసుకున్న ఝాన్సీరెడ్డి కనీసం తమకు పరిచయం లేదని, కనీసం సీనియర్లను కలుపుకొనిపోయే ప్రయత్నం కూడా ఆమె నేటికీ చేయలేదని నారాజ్ అవుతున్నారు. మరోవైపు ఆమె స్థానంలో వచ్చిన కోడలు యశస్విని పంథా కూడా అలాగే ఉందని చెబుతున్నారు. అందరి మద్దతు కూడగట్టకుంటే ఓటమి ఎరుగని నాయకుడు దయాకర్‌రావును ఢీకొట్టడం సాధ్యమేనా అన్న విషయాన్ని ఝాన్సీరెడ్డి విస్మరిస్తున్నదని చర్చించుకుంటున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మూకుమ్మడి రాజీనామాలే శరణ్యమనే ఆలోచనకు వచ్చారు. కాంగ్రెస్‌లో ఏళ్ల తరబడి కొనసాగుతూ, పార్టీకి పాలనా పగ్గాలు లేక ఎన్నో అవమానాలు ఎదుర్కొని నిలదొక్కుకున్న తమకు స్వయంగా పార్టీలోనే అవమానాలు జరిగే రోజులు వస్తాయని అస్సలు ఊహించలేదని ఆవేదన చెందుతున్నారు. వారం క్రితం ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి నేతృత్వంలో జరిగిన అసమ్మతి నేతల సమావేశంలో ఈ నెల 2వరకు తిరుపతిరెడ్డి పరిస్థితిని చక్కబెట్టాలని ఝాన్సీరెడ్డికి సూచించారని అయినా పద్ధతి మారలేదని చెబుతున్నారు. ఇక తమదారి తాము చూసుకునే సమయం వచ్చిందని చెబుతున్నారు. ఒకవైపు మంత్రి దయాకర్‌రావు నియోజకవర్గాన్ని ఇప్పటికే మూడుసార్లు చుట్టి వస్తే కాంగ్రెస్ పరిస్థితి మాత్రం ఇలా తయారైందని వాపోతున్నారు.

## 'సమన్వయ' సమావేశానికి 'నమిండ్ల' డుమ్మా ..

వర్ధన్నపేట, నవంబర్ 1 : వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశానికి నమిండ్ల శ్రీనివాస్ హాజరుకాకపోవడంతో మీటింగ్ బుధవారం వాయిదా పడింది. అధిష్టానం వర్ధన్నపేట అభ్యర్థిగా రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కేఆర్.నాగరాజును ప్రకటించింది. కానీ చాలాకాలంగా పార్టీలో పనిచేస్తున్న సీనియర్ నాయకులు కొత్తగా వచ్చిన వ్యక్తికి టికెట్ ఇవ్వడంతో తీవ్ర నిరాశకు గురై పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇందులో భాగంగానే ఏఐసీసీ అబ్జర్వర్లు బుధవారం జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఇంట్లో నియోజకవర్గ ముఖ్య నాయకులు సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కేవలం వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు మండలాల నాయకులు, మండల బాధ్యులు హాజరైనా హసన్‌పర్తి, హనుమకొండ మండలాల నాయకులెవరూ రాలేదు. దీంతో సమావేశాన్ని వాయిదా వేశారు. పార్టీ కోసం చాలాకాలంగా పనిచేసిన నమిండ్ల శ్రీనివాస్ ఈ సమావేశానికి రాకపోవడం వల్లే హనుమకొండ, హసన్‌పర్తి మండలాల ముఖ్యనాయకులు రాలేదని సమాచారం. అభ్యర్థి కూడా పార్టీలో పనిచేసే ముఖ్యనాయకులను సమన్వయం చేయడం లేదని కార్యకర్తలే చర్చించుకోవడం కనిపించింది. ఇక ప్రచారం ప్రారంభించాలనుకున్న సమయంలో ఇలా కావడంతో రూట్‌మ్యాప్ కూడా తయారుచేయలేదని చర్చించుకున్నారు.

# సింగిల్‌గా పోటీ చేస్తా



కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

## డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 1 : 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని, ఎన్నో కేసులున్నా ఎదుర్కొంటూ నిత్యం ప్రజల మధ్య ఉంటే ఉన్న తనకు కాకుండా అమ్ముడుపోయే ఒక దొంగకు, దోచుకొనేవారికి పార్టీ అధిష్టానం టికెట్ ఇచ్చి మోసం చేసిందని, ఇప్పటికైనా పునరాలోచించి టికెట్ ఇవ్వాలని లేకపోతే స్వతంత్రంగా పోటీ చేస్తానని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి స్పష్టంచేశారు. ఈమేరకు బుధవారం హనుమకొండలోని జక్రియ ఫంక్షన్ హాల్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగా మాట్లాడుతూ పదవి పేరుతో పందికొక్కులాగా దోచుకుంటూ టికెట్లు, ఇందిరమ్మ ఇళ్లు, యూనివర్సిటీ భూములు అమ్ముకున్న నాయిని రాజేందర్‌రెడ్డికి అధిష్టానం టికెట్ ఇవ్వడమేమిటని మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్నవారికి కాదని ఇతర పార్టీల నుంచి వారికి టికెట్లు కట్టబెట్టారని కాంగ్రెస్ పార్టీని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీలో ఉండి ద్రోహం చేసేవారికి టికెట్లు ఇచ్చారని మండిపడ్డారు. నాయినికి టికెట్ ఇచ్చి యూనివర్సిటీ విద్యార్థుల త్యాగాలను వృథా చేశారన్నారు. గెలిచేవారికి టికెట్ ఇవ్వాలని పార్టీలో ఉండి మోసం చేసేవారికి ఇవ్వవద్దని హెచ్చరించారు. అధిష్టానం తనకు కచ్చితంగా టికెట్ ఇస్తుందని నమ్మకం ఉందన్నారు. లేకపోతే సింహం గుర్తు మీద ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని అధిష్టానానికి అల్టిమేటం జారీచేశారు. సమావేశంలో కార్పొరేటర్లు రజాలీ, జక్కుల రవీందర్‌యాదవ్, మాజీ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కట్ల శ్రీనివాసరావు, యూత్ నాయకులు రేపల్లె రంగనాథ్, గణేశ్ పాల్గొన్నారు.

## పరకాల సమావేశానికి ఇనగాల రాలేదు..

పరకాల, నవంబర్ 1 : అభ్యర్థుల ప్రకటన తర్వాత పరకాల కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్నది. ఇందుకు పరకాల పట్టణ కేంద్రంలో బుధవారం జరిగిన నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశమే నిదర్శనంగా నిలిచింది. పట్టణంలోని స్వర్ణ గార్డెన్స్‌లో కాంగ్రెస్ నియోజకర్గ స్థాయి ముఖ్య నాయకుల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఇది కాంగ్రెస్ నియోజవర్గ ఇన్‌చార్జి ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించాల్సి ఉంది. కానీ ఆయన గైర్హాజరు కావడంతో నాయకుల మధ్య లుకలుకలు బయటపడ్డాయి. పరకాల టికెట్ కోసం మొదట ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, కొండా మురళీధర్ మధ్య వివాదం నెలకొంది. పలుమార్లు కొండా, ఇనగాల వర్గీయులు బహిరంగంగానే విమర్శలు చేసుకున్నారు. ఇటీవల ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్‌లో జరిగిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఇనగాల, కొండా నేరుగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుని తొడలు కొట్టుకోవడంతో పాటు, మీసాలు తిప్పుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కాంగ్రెస్ అధిష్టానం పరకాల అభ్యర్థిగా ఇటీవలే టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన రేవూరి ప్రకాశ్‌రెడ్డికి టికెట్ కేటాయించింది. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, అధిష్టానం బుజ్జగించడంతో శాంతించారు. ఈ విషయమై పరకాల నియోజకవర్గంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసేందుకు ఇనగాలను ఇన్‌చార్జిగా నియమించారు. కానీ పరకాలలో సమావేశానికి ఇనగాల రాకపోవడంతో కొత్తగా వచ్చిన నాయకులతోనే ముగిసింది. ఇనగాల రాకపోవడం, మండల స్థాయి నాయకులు, తెలుగు రాని ఇతర రాష్ట్రాల నాయకులతో సభను మమ అనిపించడంపై పార్టీ శ్రేణులు బహిరంగంగానే అసంతృప్తిని వెల్లడించారు.

JSW Steel

స్వచ్ఛమైన, నాణ్యమైన జెఎస్‌డబ్ల్యు స్టీల్ కోసం కింద పేర్కొనబడ్డ మా కంపెనీ యొక్క అథరైజ్డ్ డీలర్లను సంప్రదించగలరు.

AUTHORISED DEALERS

| DEALERS | DISTRICT | AREA | Ph No | Ph No |
|---|---|---|---|---|
| Venkata Sai Enterprises | Warangal | Hunter Road | 9949943339 | 9849161539 |
| Swastik Enterprises | Warangal | Deshaipet | 9390100826 | |
| Sri Thirumala Enterprises(w) | Warangal | Kasibugga | 9390108973 | |
| Ravi Agencies. | Hanmakonda | 100 feet Road Hanmakonda | 9849161545 | 8886481563 |
| S V Traders | Hanmakonda | Bheemaram Hanmakonda | 9949473826 | |
| Sri Thirumala Enterprises(H) | Hanmakonda | Dargha Road Hanmakonda | 7396577499 | 9848196228 |
| Varalaxmi Agencies | Hanmakonda | Julaiwada Hanmakonda | 7799999485 | 7396110022 |
| Kundur Enterprises | Hanmakonda | Madikonda | 9949106609 | |
| Uma maheshwari Iron & Cement | Hanmakonda | Kazipet | 9948175653 | |

మరిన్ని వివరాలకు సంప్రదించండి : రాము – 9100979728